పార్శిల్ సదుపాయం కలదు
Hotel New
BLUE EARTH
The Pearl
Multi Cuisine Restaurant & Function Halls
ప్రతీ సాయంత్రం రుచికరమైన వెరైటీ వంటకాలతో వేడివేడిగా టిఫిన్స్ అందుబాటులో
ఫారెస్ట్ ఆఫీస్ ఎదురుగా, డే & నైట్ జంక్షన్, శ్రీకాకుళం

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 23-6-2025
సంపుటి: 21 సంచిక: 77
పేజీలు: 8 వెల: రూ.1




# ఫేట్ మార్చిన ఫొటో!

- వైరల్ అవుతున్న శ్రామిక మహిళ యోగాభ్యాస దృశ్యం
- దాన్ని ఫోన్‌లోనే బంధించిన సృజనశీలి హేమచంద్ర
- ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం.. కళారంగంలో ప్రవేశం
- శిల్పిగా, ఫొటోగ్రాఫర్‌గా, కవిగా, గాయకుడిగా రాణింపు




డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

వెయ్యి మాటల్లో చెప్పలేనిది ఒక్క పోటో చెప్పగలదు. దీన్ని మరో విధంగా చాటి చెబుతూ సామాజిక మాధ్యమాలు, ప్రభుత్వ వర్గాల్లో విపరీతంగా వైరల్ అవుతున్న ఒక ఫొటో కథ ఇది.

'యోగాను సైన్స్ ఎందుకు అంగీకరించదు?' అన్న శీర్షికతో ఈ నెల 21న సంచలన సాయంకాల పత్రిక సత్యంలో ప్రచురితమైన కథనానికి ఒక శ్రామిక మహిళ యోగా చేస్తున్న ఫొటోను ఉపయోగించిన విషయం పాఠకులు గమనించే ఉంటారు.

సామాజిక మాధ్యమాల్లో కూడా బాగా వైరల్ అయిన ఆ ఫొటో విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి కూడా వెళ్లింది. ఆయన దాన్ని మీడియా సమావేశంలో చూపుతూ తమ ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్ర

- మిగతా చివరి పేజీలో




- ఆదుకున్నవారే అలుసయ్యారు
- ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు కంట్రాక్టర్ తీరుపై విమర్శలు
- పెండింగు బిల్లులు క్లియర్ చేయించిన ఎమ్మెల్యేలు
- పనులు జరగాలన్న లక్ష్యంగా సొంత డబ్బు కూడా సమర్పణ
- వారినే ఖాతరు చేయని, ప్రమాణాలు పాటించని నిర్మాణ సంస్థ
- విడ్డూరంగా ముందు రోడ్డు పనులు.. తిరిగ్గా ఇప్పుడు కల్వర్టులు నిర్మాణం

# మేం వేసిందే రోడ్డు.. చెప్పొద్దు అడ్డు!

**ఈ ఫొటోలు చూడండి.. రూ.40 కోట్ల సెంట్రల్ రోడ్ ఫండ్ నిధులతో శ్రీకాకుళం డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఆమదాలవలస బ్రిడ్జి వరకు పది కిలోమీటర్ల మేర జరుగుతున్న 80 అడుగుల రోడ్డు నిర్మాణ దృశ్యాలివి. ఇంకా సూటిగా చెప్పాలంటే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పుట్టినరోజు సందర్భంగా 'సత్యం టీవీ శ్రీకాకుళం' చేసిన ఇంటర్వ్యూలో ఆయన తీవ్ర అసంతృప్తి ప్రకటించిన రోడ్డు నిర్మాణం ఇదే. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదనే సానుభూతిని అటు ఆమదాలవలస ఎమ్మెల్యే, ఇటు శ్రీకాకుళం ఎమ్మెల్యే చూపిస్తుంటే.. దాన్నే సదరు కాంట్రాక్టర్ అలుసుగా తీసుకున్నట్టు కనిపిస్తోంది.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ రోడ్డు వెడల్పు పనులకు 2023లోనే టెండర్ల ప్రక్రియ పూర్తయినా ఇంతవరకు నిర్మాణం పూర్తికాలేదు. ఈ పాపాన్ని గత ప్రభుత్వం మీదకు ఇన్నాళ్లూ నెట్టేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అటు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌లు చెరో చెయ్యి వేసినా కూడా ఈ పనులు అనుకున్న రీతిలో సాగడంలేదు. 2023 నుంచి 2025 మధ్యలోకి వచ్చేసినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ రోడ్డుకు సంబంధించి నగర పరిధిలో ఉన్న భాగం విస్తరణ పూర్తయ్యే నాటికి మరో ఏడాది పట్టేట్టుంది. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఈ రోడ్డును అందుబాటులోకి తెస్తామని ఇద్దరు ఎమ్మెల్యేలు మాటిచ్చారు. అయితే అప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించలేదు కాబట్టి తాము ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేమని సంబంధిత భవానీ కన్‌స్ట్రక్షన్స్ చేతులెత్తేసింది. దీంతో పెండింగ్ బిల్లుల ఫైల్ పట్టుకుని ఎమ్మెల్యే కూన రవికుమార్

- మిగతా చివరి పేజీలో

ప్రథమ వర్ధంతి
మీ చెరగని చిరునవ్వు మా మనస్సులో చిరస్థాయిగా నిలిచినా
మీ మరణం మాకు తీరని లోటు..
మీరు మా నుండి దూరమై సంవత్సర కాలం గడిచినా,
మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ



కీ॥శే॥ కొన్న సత్యనారాయణమూర్తి గారు
(రమణ)
రిటైర్డ్ ఎంప్లాయ్ ఇన్ ఉమన్ & చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్,
& ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, శ్రీకాకుళం
జననం: 10-08-1960 మరణం: 02-07-2024

భార్య: కొన్న వినోదిని
కుమారుడు: కొన్న రవిరాజ్ కుమార్తె: కొన్న అనూష

తమ్ముళ్లు - మరదళ్లు
కొన్న వెంకటేశ్వరరావు (వాసు) - రాజేశ్వరి
ప్లానింగ్ ఆఫీసర్, వి.ఎం.ఆర్.డి.ఎ, విశాఖపట్నం
కొన్న మధుసూదనరావు - లక్ష్మి
ఎం.డి., కొన్న చిట్‌ఫండ్స్

చెల్లెళ్లు - బావలు
కీ॥శే॥ ప్రగడ జయలక్ష్మి - కీ॥శే॥ నర్సింహమూర్తి
పూడి స్వర్ణలత - పూడి తిరుపతిరావు
బి.జె.పి. రాష్ట్ర నాయకులు

బావమరుదులు:
కొంక్యాన లక్ష్మీనరసింహరావు, ల్యాండ్‌లార్డ్
కొంక్యాన సుభాష్, అడ్వకేట్
కుమారులు, కుమార్తెలు, మేనల్లుల్లు,
మేనకోడళ్లు, కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

• ఎడిటోరియల్

# మళ్లీ తెరపైకి నియోజకవర్గాల పునర్విభజన

దాదాపు 14 ఏళ్ల తర్వాత దేశంలో జనగణనకు కేంద్ర ముహూర్తం నిర్ణయించగా, సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ దానికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయడంతో రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజనపై రాజకీయ పార్టీల్లో ఆశల మోసులు వేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ దీనిపైనే చర్చలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో అమల్లోకి వచ్చిన ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం 2019 ఎన్నికల నాటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్వభజన జరిపి కొత్త నియోజకవర్గాల్లో సాధారణ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ ప్రక్రియ జరగలేదు. కొత్త జనాభా లెక్కలు సేకరించిన తర్వాతే.. ఆ గణాంకాల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ కరోనా మహమ్మారి కారణంగా 2021లో జరగాల్సిన జనగణనను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఐదేళ్ల తర్వాత 2026లో ఆ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమైంది. కానీ దీనికి భిన్నంగా జమ్మూ కశ్మీర్ విభజన అనంతరం అక్కడ నియోజకవర్గాలను పునర్విభజించడాన్ని ప్రస్తావిస్తూ తెలుగు రాష్ట్రాల్లోనూ అదే రీతిలో నియోజకవర్గాలను విభజించాలని కోరుతూ జర్నలిస్టు పురుషోత్తం రెడ్డి సుప్రీంకోర్టులో కేసు వేశారు. అయితే జనాభా లెక్కలు తేలిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని సుప్రీంకోర్టుకు కేంద్రం తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఇది విచారణ దిశలో ఉంది. ఈ తరుణంలో జనగణనకు కేంద్రం గజెట్ జారీ చేసింది. జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా ఈసారి చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనతో పాటు రిజర్వేషన్లను కూడా మార్చేందుకు అవకాశం లభిస్తుంది. ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ నియోజకవర్గాలను 225కు, తెలంగాణలో నియోజకవర్గాలను 119 నుంచి 134కు పెంచాల్సి ఉంది. కొత్త జనాభా గణాంకాల ఆధారంగా ఆ మేరకు పెంచేందుకు మార్గం సుగమం అవుతుంది. అదే సమయంలో కులగణన జరుగుతున్నందున సామాజికవర్గాలవారీగా, అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించినందున మహిళలకు నియోజకవర్గాలు రిజర్వ్ చేసేందుకు మార్గం సుగమమైనట్లే. వీటి ఆధారంగానే 2029 సార్వత్రిక ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే వచ్చే ఎన్నికలనాటికి రాష్ట్రంలో మరో 50 కొత్త నియోజకవర్గాలు ఏర్పాటవుతాయి. ఆ మేరకు రాజకీయ పార్టీలకు తమ అభ్యర్థులుగా ఎక్కువమందికి అవకాశం కల్పించే వెసులుబాటు లభిస్తుంది. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి వచ్చే ఎన్నికల్లోనూ కూటమిగానే పోటీ చేయదలిస్తే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సులభతరం అవుతుందంటున్నారు. కూటమి పార్టీలో ఈ పరిణామం జోష్ నింపుతుండగా ప్రధాన ప్రతిపక్షమైన వైకాపా మాత్రం మౌనంగా ఉండిపోయింది. గతంలో నియోజకవర్గాల పునర్విభజనకు సై అన్న వైకాపా ఇప్పుడు మాత్రం స్పందించడంలేదు. ఎందుకంటే.. పార్టీ నుంచి చాలామంది నాయకులు వెళ్లిపోవడంతో నియోజకవర్గాల్లో నాయకత్వ కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడున్న నియోజకవర్గాల్లోనూ చాలావాటికి సమర్థులైన ఇన్‌ఛార్జీలు లభించక పార్టీ నాయకత్వం సతమతమవుతోంది. ఈ పరిస్థితుల్లో 50 నియోజకవర్గాలు పెరిగితే నాయకత్వ సమస్య మరింత తీవ్రతరం అవుతుందన్నది ఆ పార్టీ ఆందోళన. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం 25 లోక్‌సభ స్థానాలు ఉండగా, మరో 6-8 వరకు పెరిగే అవకాశం ఉందని నాయకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న మూడు పార్టీల కూటమిలో మొన్నటి ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కోసం త్యాగం చేసిన వారికి ఈసారి సీట్లు కేటాయింపునకు అవకాశం వస్తుందని చెబుతున్నారు. కాగా కులగణన అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంఖ్య పెరగటం ఖాయమని.. ఆ దామాషా ప్రకారం సీట్ల కేటాయించాల్సిన అంశం తమకు కలిసి వచ్చేదిగా కొందరు వైకాపా నాయకులు చెబుతున్నారు. కాగా నియోజకవర్గాల పెరగనున్న నియోజకవర్గాలు, మారనున్న సామాజిక సమీకరణాలు వచ్చే ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేస్తాయన్నది నిర్వివాదాంశం. 2008లో పునర్విభజన అనంతరం 2009లో జరిగిన ఎన్నికలను పార్టీలు గుర్తు చేసుకుంటున్నాయి. దీంతో రాజకీయంగా ఈ నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు ఏపీ పార్టీల భవిష్యత్తును నిర్దేశించనున్నాయన్నది మాత్రం వాస్తవం.

# హోటల్ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్లకు చివరి తేదీ జూలై 4

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హోటల్ నిర్వహణ రంగంలో వృత్తిని ఎంచుకోవాలనుకునే విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి తమ దరఖాస్తులను జూలై 4వ తేదీలోపు కళాశాలకు పంపాలని ఎస్ఐహెచ్ఎం అధికారులు సూచించారు. ఆదివారం విజేత హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థలో పలు కోర్సులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని అడ్మిషన్ ఇన్‌ఛార్జ్ కె. శివరామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు విలేఖరుల వెల్లడించారు.




**కోర్సుల వివరాలు:**

- ఇంటర్ ఉత్తీర్ణతతో మూడేళ్ల బీఎస్సీ (హోటల్, హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్) కోర్సు. - పదో తరగతి అర్హతతో ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటీసరి, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సులు.

ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్లతో పాటు ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని బాలురు, బాలికలకు వేర్వేరు హాస్టల్ సౌకర్యాలు, బ్యాంకు రుణ అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు: 9701343846, 9100558006, 9700440604, వెబ్‌సైట్:www.sihmtpt.org, ఎస్.వి. జూపార్క్ దగ్గర, ఎస్.వి.ఐ.సి.సి.ఏ.ఆర్ హాస్పిటల్ ఎదురుగా, తిరుపతి వద్ద సంప్రదించవచ్చునని సూచించారు.

# గాండ్ల తెలికులు అభివృద్ధి చెందాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గాండ్ల తెలికుల సామాజికవర్గానికి చెందినవారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించే విధంగా అడుగులు వేయాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతరం అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం సామాజిక భవనంలో గాండ్ల తెలుకుల జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు కొమనపల్లి లక్ష్మణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరవ అనంతం మాట్లాడుతూ రాష్ట్రంలోని గాండ్ల తెలుకల సామాజిక వర్గాన్ని ఒకే తాటిపై తీసుకురావాలన్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని సూచించారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 14న జిల్లాలో నిర్వహించనున్న కార్యవర్గ సమావేశాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం తమకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం గాండ్ల తెలికుల సామాజిక వర్గం నువ్వులు, వేరుశనగతోపాటు మరికొన్ని విత్తనాల నుంచి తైలం తీసే వృత్తి చేపట్టి గౌరవంగా జీవించే పరిస్థితి ఉండేదని, కర్ర గానుగుల స్థానంలో యాంత్రికరణ చోటు చేసుకోవడంతోపాటు నూనె వ్యాపారాన్ని మార్వాడి వీళ్ళతో పాటు ఇతర సామాజిక వర్గాలు చేపట్టడంతో గాండ్ల తెలుకుల సామాజిక వర్గం పోటీని తట్టుకోలేక ఉపాధిని కోల్పోయి. చివరకు ఇతర పనుల్లోకి వెళ్ళవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీసి చెట్టి, డి.వెంకటేశం, బి.గోపాల్ తదితరులు ఎమ్మెల్యేలుగా, భారత ప్రధాని నరేంద్ర మోడీ, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎండీగా సేవలందించిన సజ్జనార్‌తో పాటు బీహార్, రాజస్థాన్, ఒడిస్సా, కర్ణాటకతోపాటు మరి కొన్ని రాష్ట్రాలలో గానుగ ద్వారా నూనె తీసి వృత్తి చేపట్టే తేలి, సాహు, గుప్తా తదితరులు గాండ్ల తెలుకుల వాళ్లేనని ఆయన గుర్తు చేశారు. అయితే వాళ్లంతా ఇతర రాష్ట్రాల్లో సామాజిక న్యాయం తేవడంలో సఫలీకృతులయ్యారని మన రాష్ట్రంలో మాత్రం మన సామాజిక వర్గానికి సామాజిక న్యాయం లభించడం లేద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని గమనించి తమ కులస్థులంతా ఏకం కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సామాజిక వర్గ ప్రతినిధులు దాసరి జ్ఞానమూర్తి, ఇంజరాపు విశ్వనాథం కెల్లా శ్రీనివాస్, బుర్ర రవిచంద్ర,కెల్లా ఉమామహేశ్వరరావు, కల్లేపల్లి జగన్, కె.విజయ, తెలికుల మన్మధ, గణేష్‌సాహు, తలగాపు కామేశ్వరరావు, ఎండపల్లి ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పి.గోపి, గండేపల్లి శ్రీనివాస్, కల్లేపల్లి శ్రీనివాస్, తెలుకుల సురేష్, వెంకటరామరాజు, బాలు, కెల్లా త్రినాథ్, అంబటి శ్రీనివాస్, జామన సాయిరాజ్, తలగాపు వెంకటరమణతోపాటు జిల్లా నలుమూల నుంచి కార్యవర్గ సభ్యులు, పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.



# హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కోర్ట్‌లో జరుగు అధికారిక వర్క్‌షాప్‌కు విచ్చేసిన, హైకోర్ట్ జడ్జి, శ్రీకాకుళం జిల్లా డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సత్తిరెడ్డి సుబ్బారెడ్డిని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాదరావు, పిట్ట దామోదరరావుల ఆధ్వర్యంలో నగరంలో ఆయన బస చేసిన ఓ ప్రైవేట్ హోటల్‌లో సీనియర్ న్యాయవాదులతో కలిపి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాన కృష్ణచంద్ (మాజీ పబ్లిక్ ప్రాసెక్యూటర్), కిలారి ఈశ్వరరావు, ఎన్ని సూర్యారావు, స్టేట్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్, కొమరాపు ఆఫీస్‌నాయుడు, ప్రస్తుత, మాజీ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతరాజు, మామిడి క్రాంతి, ఆర్టిసి స్టాండింగ్ కౌన్సిల్ బి.సింహాచలం తదితరులున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్, కోర్ట్ ఆవరణలో మౌలికసదుపాయాల ఏర్పాటు, ప్రధానకేంద్రంలో న్యాయమూర్తుల కొరత ఇంకా ఇతర సమస్యలను వారి దృష్టికి హాజరైన బార్ ప్రతినిధులు తీసుకువెళ్లగా అవి పరిష్కారమయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



మొండేటి వీధిలో వెలసియున్న శ్రీ లలితా దేవి సహిత శివ కామేశ్వర వారి ఆలయంలో బహుళ త్రయోదశి తత్కాల చతుర్దశి సోమవారం మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం శ్రీశ్రీశ్రీ శివకామేశ్వర స్వామి వారి దేవాలయంలో నందీశ్వర స్వామి, శివకామేశ్వర స్వామిలకు విశిష్ట సుగంధ్ర ద్రవ్యాలతో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

# కవితాత్మక కథ!

**షార్ట్ ఫిలింతో ఫీచర్ ఫిలిం స్థాయి ఫాలోయింగ్ సంపాదించడం అరుదు. 'మధురం' అనే లఘు చిత్రంతో అలాంటి పేరే సంపాదించాడు ఫణీంద్ర నర్సెట్టి. తర్వాత 'మను'తో అతను దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కానీ అది నిరాశపరిచింది. చాలా గ్యాప్ తీసుకుని ఇప్పుడు '8 వసంతాలు' అంటూ వచ్చాడు ఫణీంద్ర . ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.**

**కథ:**

శుద్ధి అయోధ్య (అనంతిక) ఆత్మభిమానం ఉన్న అమ్మాయి. తండ్రి చనిపోవడంతో ఓవైపు ఊటీలోని తమ టీ ఎస్టేట్లను చూసుకుంటూ.. మరోవైపు తన అభిరుచి మేరకు రచయితగా పుస్తకాలు రాస్తూ ఉంటుంది. మార్షల్ ఆర్ట్స్ లోనూ ఆమెకు మంచి ప్రావీణ్యం ఉంటుంది. ఊటీలో కరాటే-మార్షల్ ఆర్ట్స్ నేర్పించే స్కూల్ లో వరుణ్ (హను రెడ్డి) అందర్నీ ఓడిస్తుంటే.. శుద్ధి అయోధ్య అతణ్ని ఓడిస్తుంది. ఈ క్రమంలో వరుణ్.. శుద్ధి ప్రేమలో పడతాడు. కొన్నాళ్లకు ఆమె కూడా అతణ్ని ప్రేమిస్తుంది. కానీ శుద్ధి తన ప్రేమను వరుణ్ కు చెప్పేలోపే అతను ఆమెను వదిలేసి వెళ్ళిపోతాడు. అదే సమయంలో శుద్ధి ఎంతో అభిమానించే మార్షల్ ఆర్ట్స్ గురువు చనిపోతాడు. ఆ తర్వాత శుద్ధి ఏం చేసింది? వరుణ్ ఎందుకు వదిలేసి వెళ్ళిపోయాడు? శుద్ధి తన ప్రేమని ఎలా మర్చిపోయింది? గురువు కోసం ఏం చేసింది? శుద్ధి జీవితంలోకి ఇంకో ప్రేమ ఎప్పుడు ఎలా వచ్చింది.. అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

భావయుక్తమైన కవిత్వం చదివి మైమరిచిపోయి వేరే లోకంలో విహరిస్తారు కొంతమంది. కానీ ఆ రకమైన అభిరుచి లేని వాళ్లకు అదే కవిత్వాన్ని వినిపించే ప్రయత్నం చేస్తే నా వల్ల కాదు బాబోయ్ అని దండం పెట్టేస్తారు. కవిత్వం చదివి ఆస్వాదించిన వాళ్లు గొప్పోళ్లు అయిపోరు. అది నచ్చని వాళ్లను టేస్ట్ లేదని విమర్శించనూజాలం. ఎవరి అభిరుచి వాళ్లది. ఈ స్పీడు యుగంలో పొయెట్రీ చదివి ఆస్వాదించే వాళ్లు తక్కువైపోయినా సరే.. యువ దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి '8 వసంతాలు'తో విజువల్ పొయెట్రీ రాయడానికి ప్రయత్నించాడు. ఇక ప్రేమకథ అనగానే అబ్బాయి దృక్కోణం నుంచి చర్చించే కథలే ఎక్కువగా కనిపిస్తాయి. ఇక్కడ కూడా ఫణీంద్ర భిన్నమైన దారిలో నడిచాడు. అమ్మాయి జీవితంలో ప్రేమ దశలను చర్చించాడు. ఇది ఇంకో రకమైన రిస్క్. ఐతే ఫణీంద్ర చాలా సిన్సియర్ గా ఒక కన్విక్షన్ తోనే ఈ ప్రయత్నం చేశాడు కానీ.. రెండు గంటల పాటు ప్రేక్షకులను కుదురుగా కూర్చోబెట్టగలిగాడా అంటే మాత్రం ఔనని చెప్పలేం. ఇందులో కొన్ని బ్యూటిఫుల్ మూమెంట్స్ ఉన్నాయి. బలమైన భావోద్వేగాలు ఉన్నాయి. చాన్నాళ్ల పాటు గుర్తుండే సంభాషణలున్నాయి. లీడ్ యాక్టర్ పెర్ఫామెన్స్ అయితే కట్టిపడేస్తుంది. విజువల్స్.. మ్యూజిక్ స్టాండౌట్‌గా నిలుస్తాయి. ఇన్నీ ఉన్నా కథనం మాత్రం అనుకున్నంతగా రక్తి కట్టలేదు. "మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు.. భాగ్యనగరాలు ఉన్నాయి. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి. మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప" అంటూ ట్రైలర్లో వినిపించిన డైలాగ్ తో ఈ సినిమాను సింప్లిఫై చెప్పొచ్చు. అమ్మాయిని మైమరిచిపోయేలా చేసే తొలి ప్రేమ.. తర్వాత అది చేసే గాయం.. తన వ్యక్తిగత జీవితంలో ఇతర ఒడుదొడుకులు.. ఈ గాయాలన్నింటినీ మాన్పించే మరో ప్రేమ.. ఇలా ఒక అమ్మాయి జీవితంలో 8 సంవత్సరాల్లో జరిగే పరిణామాలను దర్శకుడు చర్చించాడు. ఐతే ఒక దశ వరకు ఈ పరిణామాలు ఆసక్తికరంగా అనిపిస్తాయి. ఎప్పుడైనా సరే ప్రేమ సన్నివేశాలు ఆహ్లాదకరంగా అనిపిస్తాయి. కానీ బ్రేకప్.. ఎడబాటు.. ఈ కోణంలో కథ నడిచినపుడు ప్రేక్షకుల ఆసక్తిని నిలిపి ఉంచడం సవాలే. ఫణీంద్ర ఇక్కడే తడబడ్డాడు. తొలి ప్రేమకథ ఉన్నంత ఆసక్తికరంగా రెండో కథ అనిపించదు. కథానాయిక జీవితంలో జరిగే ఇతర పరిణామాలు కూడా అనాసక్తికరంగా అనిపిస్తాయి. ద్వితీయార్థంలో చెప్పడానికి పెద్దగా కథ లేకపోయింది. కథనం కూడా మరీ నెమ్మదించి విసుగు పుట్టిస్తుంది. సన్నివేశంలో ఏదో ఒక ప్రత్యేకత ఉన్నపుడే.. డైలాగులు కూడా ఎలివేట్ అవుతాయి. కానీ ద్వితీయార్థంలో ప్రేక్షకుల అటెన్షన్‌ను రాబట్టే సన్నివేశాలే కరవైపోయాయి. కేవలం అందమైన విజువల్స్.. డైలాగ్స్ ఎంతని సినిమాను డ్రైవ్ చేస్తాయి? కథ ముందుకు కదలక స్టక్ అయిపోయిన ఫీలింగ్ కలుగుతుంది. కథనం డెడ్ స్లో అయిపోవడంతో ఒక దశ దాటాక '8 వసంతాలు' ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. కాకపోతే క్లైమాక్సుతో మళ్లీ సినిమాకు కొంచెం జీవం వస్తుంది. ముగింపు సన్నివేశాలు మంచి ఫీల్ ఇస్తాయి. ముందే అన్నట్లు '8 వసంతాలు' ఎలాంటి సినిమా అన్నది ట్రైలర్ చూసినపుడే ఒక అంచనా వచ్చేస్తుంది. ఆ అంచనా మేరకు ఆస్వాదించగల అభిరుచి ఉన్న వాళ్లు ఒకసారి ట్రై చేయొచ్చు. - తుపాకి.కామ్ సౌజన్యంతో...

**నటీనటులు:**

ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ అవంతిక సనిల్ కుమార్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. ఒక కొత్తమ్మాయి ఇంత ప్రభావవంతంగా ఒక పాత్రను పోషించడం అరుదు. సినిమా మొత్తాన్ని భుజాల మీద నడిపించాల్సిన పాత్రలో అవంతిక అద్భుతంగా చేసింది. దర్శకుడు తీసుకున్న సాహసోపేత నిర్ణయానికి న్యాయం చేసింది. ఇటు అందంతో ఆకట్టుకుంటూ.. అటు అభినయంతో కట్టిపడేసింది. ఎక్కువగా క్లోజప్స్ ఉన్న సన్నివేశాల్లో ఆమె భావోద్వేగాలను పలికించిన తీరు మెప్పిస్తుంది. హను రెడ్డి ప్రేమికుడి పాత్రలో.. తన తల్లిదండ్రుల కల కోసం బాధపడే పాత్రలో ఆకట్టుకున్నాడు. తన లుక్.. స్క్రీన్ ప్రెజెన్స్ బాగున్నాయి. పాత్రకు తగ్గట్లుగా నటించాడు. రవితేజ నెమ్మదస్తుడైన తెలుగు రచయితగా జస్ట్ ఓకే అనిపించాడు. హీరోయిన్ స్నేహితుడి పాత్రలో కన్నా మెప్పించాడు. అవంతిక తల్లి పాత్రలో నటించిన ఆర్టిస్ట్ ఓకే. కానీ గురువు పాత్రలో నటించిన వ్యక్తి మాత్రం ఆ క్యారెక్టర్ కు కుదరలేదనిపిస్తుంది. మిగతా ఆర్టిస్టులు మామూలే.

**సాంకేతిక వర్గం: '8 వసంతాలు' సాంకేతికంగా ఉన్నతంగా అనిపిస్తుంది. అన్ని టెక్నికల్ డిపార్ట్మెంట్స్ తమ ప్రతిభను చాటాయి. ముఖ్యంగా విశ్వనాథ్ రెడ్డి ఛాయాగ్రహణం విజువల్ పొయెట్రీలా అనిపిస్తుంది. దర్శకుడి అభిరుచికి తగ్గట్లు.. అతను ప్రతి సన్నివేశాన్ని అందంగా తీర్చిదిద్దాడు. విజువల్స్ ప్రతి సీన్లో ఆకట్టుకుంటాయి. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ కూడా సినిమాకు తన వైపు నుంచి ఇవ్వాల్సిందంతా ఇచ్చాడు. నేపథ్య సంగీతం సినిమాకు ప్రాణం పోసింది. పాటలు కూడా ఓకే. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ ఫణీంద్ర నర్సెట్టి.. తన కలం బలాన్ని మాటల్లో బాగానే చూపించాడు. "పేగు పంచి ప్రాణం పోయగలిగిన వాళ్లం చితి ముట్టించి మోక్షం ఇప్పించలేమా?".. "మనం ఇక్కడికి ఉండటానికి వచ్చాం ఉండిపోవడాని కి కాదు".. "పిల్లలు తల్లితండ్రుల సుఖాలే కాదు కలలు కూడా పంచుకోవాలి".. "అనాథ అంటే అమ్మానాన్న లేనోడు కాదు ఆశయం లేనోడు".. "ప్రేమ జీవితంలో ఒక దశ మాత్రమే అదే దిశ కాదు".. ఇలా స్ట్రైకింగ్ గా అనిపించే లోతైన డైలాగులు చాలానే సినిమాలో ఉన్నాయి. ఒక అమ్మాయి జీవితంలోని ప్రేమ దశల మీద ఓ కథ రాసి డైరెక్ట్ చేయాలనుకోవడం సాహసమే. అందుకే ఇది ఎప్పుడూ చూసే సినిమాల్లా అనిపించదు. ఐతే డైలాగుల్లో ఉన్నంత లోతు.. ఈ కథలో కొరవడినట్లు కనిపిస్తుంది. ఈ కథలను నెమ్మదిగానే చెప్పాలి కానీ.. కథలో పెద్దగా మలుపులు లేకపోవడం.. డైలాగుల మీదే ఎక్కువ ఆధారపడడంతో స్క్రీన్ ప్లే అంత ఎంగేజింగ్ గా అనిపించదు. రచయితగా.. దర్శకుడిగా తన ముద్రను చూపించినా.. మొత్తంగా ఇంకా మెరుగైన పనితనాన్ని ఆశిస్తారు ప్రేక్షకులు.**



## సిక్కోలు ఉద్దానం సేవాసమితి ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, పలాస)

మందస మండలం సువర్ణపురం పంచాయతీ పూజనగర్ గ్రామానికి చెందిన బొడ్డు శరత్ కుమార్‌కు సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. శరత్‌కుమార్ ఇటీవల బరంపురం వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రస్తుతం శ్రీకాకుళం మెడికవర్ హాస్పిటల్లో క్రిటికల్ కండిషన్‌లో ఉన్నారు. ఈమధ్యకాలంలోనే ఆయన తండ్రికి హార్ట్ సర్జరీ చేశారు. పేదరికంతో కూడుకున్న కుటంబం కావడంతో ఇప్పుడు శరత్ కోలుకోవడానికి సుమారు రూ. 6లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఏమి చేయాలో తెలియని పరిస్థిల్లో దాతలు సహాయం కోరారు. విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు స్పందించి హాస్పిటల్ సిబ్బందితో కూడా మాట్లాడారు. అదే విధంగా తమవంతు సహాయంగా రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మిగిలిన సేవా సంస్థలు వారు కూడా స్పందించి ఈ కుటంబానికి తమవంతు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రాజు, సోమేశ్, చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బలగ ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తులు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని బలగ ప్రభుత్వ డిఎల్టిసి ఐటిఐకు రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చేనెల 21న ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ కోర్స్, ఫిట్టర్, మోటార్ మెకానికల్, డీ.ఎం సివిల్, ఎలక్ట్రిషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జులై 15 లోగా ఆన్లైన్ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జులై 17న వేరిఫికేషన్ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఆ రోజు బలగలోని తమ ఐటిఐ కార్యాలయానికి హాజరుకావాలన్నారు.



## శిష్టకరణ సంఘం ఏకతాటిపైకి రావాలి

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

రాష్ట్ర శిష్టకరణ సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషంచాలని రాష్ట్ర శిష్టకరణ సంఘం 63/79 అధ్యక్షులు అక్కుమహంతి రాజా పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం గాజువాక లయన్స్‌క్లబ్ వేదికగా నిర్వహించిన కార్యవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర శిష్టకరణం సంఘం ఏకతాటిపై నిలబడి ఇతర అంశాలను అనగా ధవళేశ్వరం బ్యారేజ్ నిర్మాణంలో తొలి తెలుగు ఇంజినీర్ కాటన్ దొర సమకాలికులు రాష్ట్ర శిష్టకరణ ప్రముఖులు స్వర్గీయ రావుబహదూర్ వీణం వీరన్న వంటి శిష్టకరణ ప్రముఖుల విగ్రహాలను ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. అదే విధంగా వారి చరిత్రలో వారి ఘనకీర్తిని చాటిచెప్పే విధంగా, వారి సేవలను కొనియాడుతూ, ప్రభుత్వం చొరవ తీసుకొనే విధంగా తగిన కార్యాచరణ రూపొందించాలన్నారు. అనంతరం రాజమండ్రి వాస్తవ్యులు బంధువుల కమ్యూనిటీ హాలు నిర్మాణం కొరకు పూర్తిస్థాయిలో మద్దతు అందజేశారు. కాలం చెల్లిన అఖిల భారత సంఘానికి అధ్యక్షులు అంటూ మీడియాముఖంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చి 2న విశాఖలోని ప్రేమ సమాజం వేదికగా రాష్ట్ర శిష్టకరణం సంఘం ఎన్నిక నిర్వహణ ఏర్పాటుపై గూండాగిరి అనే ప్రకటనలు చేసిన వారు బేషరతుగా 63/79 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణం సంఘానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై న్యాయనిపుణుల సలహా మేరకు తగిన చర్యలు తీసుకునే విధంగా కార్యవర్గ సభ్యులు ఆమోదించారు. అనంతరం గుండె సంబంధిత బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా రూ. 3 లక్షల రూపాయలు సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్, అధ్యక్షులు అక్కుమహంతి రాజాలకు సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. బాధితునికి సంఘం అండగా ఉందని ధైర్యం కల్పించేందుకు గానూ వైద్యఖర్చుల కొరకు కొంత ఆర్థిక సహాయం ఆసుపత్రి వద్ద ప్రత్యక్షంగా అందివ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బద్రిమహంతి వెంకటరావు, గౌరీశంకర్, బెహరా రాధాకుమారి, డబ్బీరు సత్యప్రసాద్, నాగుమంత్రి వెంకటేశ్వరరావు, శేఖరమహంతి హేమసుందర్, బలివాడ సత్యారావు, శేఖర మహంతి శ్రీనివాస్ పట్నాయక్, శ్రీనివాస్ వీణం, రుద్ర కోటేశ్వర రావు, రామచంద్రరావు, గజరావు వినోద్, జక్కువ గోపీనాథ్ పట్నాయక్, భాసంగి తిరుపతి రావు, ప్రతాపరావు శ్రీనివాసరావు, సదాశివుని వెంకటేశ్వరరావు, దండుమహంతి లక్ష్మణరావు, ఏఆర్‌కే రావు, పోలాకి రమణమూర్తి, సాలూరు మోహనరావు, పుండరీ కాక్షయ, బొమ్ము శ్రీనివాసరావు, విజయ్ దివాకర్, రవి ప్రకాశరావు, బెవర్త అశోక్, సంజుక్త పట్నాయక్, ప్రసాద్, చక్రధర మహంతి కవిత, రావిపల్లి ఉషారాణి, త్యాడ మాధవి, దదిరావు వరప్రసాద్, మహేంద్ర, వికాస్ లు పాల్గొన్నారు.



## శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి



(సత్యంన్యూస్, రణస్థలం)

బిజెపి యొక్క సైద్ధాంతిక మాతృ సంస్థ అయిన భారతీయ జన సంఘ్ స్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో యువనాయకుడు నడుకుదిటి తేజబాబు ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత మాత సేవలో ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు, ఆయన చురుకైన వ్యక్తిత్వం దేశంలోని ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవి కుమార్, ఫిషరీష్ సెల్ జిల్లా అధ్యక్షులు కరాటే లక్ష్మణ్, జిల్లా సెక్రటరీ సురేష్ కుమార్, బిజెపి మండల మాజీ అధ్యక్షులు దన్నాన లక్ష్మణ రావు, ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలిలో 108 అంబులెన్సులు ఆకస్మిక తనిఖీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో ఆపదలో వున్న ప్రజల కొరకు ప్రవేశపెట్టిన 108 పనితీరును పరిశీలించుటకు సోమవారం టెక్కలి డివిజన్ ఓఈ యమ్ రంగ ప్రసాద్ టెక్కలి జిల్ల హాస్పిటల్ వద్ద రెండు108 అంబులెన్స్‌లను తనిఖీ చేసి, వెహికల్‌లో ఉన్న పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. పేద ప్రజలకు 108 సేవలు సక్రమంగా అందాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి 108 ఈ.యం.టి శ్రీనివాస్ బెహరా, దేవాది శ్రీనివాసరావు, పైలట్ మెట్ట సతీష్, సాహుకారి రాజేష్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మె

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె బాట పట్టారు. స్థానిక శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉదయం నుండి విధులు బహిష్కరించి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ కార్యాలయ సిబ్బంది 40వ రోజుకూడా నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్‌లు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు, ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్‌కు రూ. 29200లు, నాన్ టెక్నికల్ రూ. 24500గా పెంచి ఇవ్వాలన్నారు. చర్చలకు తొందరగా పిలవాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలన్నారు. 60 నుండి 62 సంవత్సరాలు రిటైర్మెంట్ వయసు పెంచాలన్నారు. సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలా జరగని పక్షాన రాష్ట్రవ్యాప్త ఉద్యమాలూ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే తమ వైఖరిని తెలియజేయాలన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, సమ్మె మరి తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్స్పెక్టర్ ,కంప్యూటర్ ఆపరేటర్స్, డిపిఓ, సెక్యూరిటీ గార్డ్స్, పార్క్ వర్కర్స్, గ్యాంగ్ మజ్దూర్, వాటర్ వర్క్స్ వర్కర్, ఎలక్ట్రికల్ వర్కర్స్ , అటెండర్స్, తదితరులు పాల్గొన్నారు




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## ప్రైవేటీకరణ చేస్తే ప్రజలు సహించరు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలో కార్పొరేషన్ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తే ప్రజల సహించరని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు కార్యదర్శులకు సభ్యులు బి.కృష్ణమూర్తి హెచ్చరించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో చరిత్రమైన మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తులు మున్సిపల్ కార్పొరేషన్ జిల్లా గ్ర పెద్ద మార్కెట్ బాపూజీ కళామందిర్ గాంధీ పార్క్ డైమండ్ పార్కు కార్గిల్ పార్కు నాగావళి రివర్ పార్కు ఎల్బీఎస్ కాలనీ పార్కు జిల్లా గ్రంథాలయము తో పాటుగా పెద్దపాడు చెరువు విజయాతిత్య పార్కు మొదలు కోట్లాది రూపాయల ఆస్తులను కారు సౌకర్ ఎందుకు ప్రైవేటు వ్యక్తులకి కట్టబెట్టడానికి పూనుకున్నారని కేంద్ర పౌర విమానయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమే అభివృద్ధి అని వారు ప్రశ్నించారు. కేంద్రమంత్రిగా శ్రీకాకుళం నగర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మీరు నిధులు ఎందుకు తేవడం లేదు అని వారు ప్రశ్నించారు. ఇదేనా మీరు చేస్తున్న అభివృద్ధి అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు కార్యాలయాలు అభివృద్ధికి ప్రభుత్వం నుండి ఎందుకు నిధులు కేటాయించడం లేదని వారు ప్రశ్నించారు. 2024-25 సంవత్సరంలో శ్రీకాకుళం నగర కార్పొరేషన్‌కు ప్రజల వద్ద నుండి పన్నుల రూపంలో రూ. 28 కోట్లు ప్రభుత్వం వసూలు చేసిందని అందులో రూ. 15 కోట్లు వాటి అభివృద్ధి కేటాయిస్తే సరిపోతుందని ప్రైవేటీకరణ చేయవలసిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.




## సాఫ్ట్‌బాల్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నిక




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న క్రిస్టల్ ప్యాలెస్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవి కుమార్‌ని రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం వివరాలు వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్ కామేశ్వరి (నెల్లూరు) స్టేట్ సెక్రటరీ సూర శ్రీనివాస్ (శ్రీకాకుళం), జాయింట్ సెక్రటరీ ఏ.నాగరాంప్రసాద్ (ఈస్ట్ గోదావరి), పి.సంపత్ రెడ్డి (గుంటూరు), సీఈఓ వెంకటేశ్వర్లు (అనంతపురం), ఎం.వి.రమణ కన్వీనర్ (శ్రీకాకుళం), పి.నరసింహరెడ్డి (గుంటూరు) ఆర్గనైసింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఈ ఎలక్షన్‌కి ఎలక్షన్స్ ఆఫీసర్‌గా రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాధరావు, ఇండియా ఫెడరేషన్ సెక్రటరీ అఫ్ సాఫ్ట్‌బాల్ ప్రవీణ్ ఆరోరా సమక్షంలో నిర్వహించారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గసభ్యులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని, భవిష్యత్తులో సాఫ్ట్‌బాల్‌లో మరిన్ని రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి క్రీడాభివృద్ధికి తోడ్పడతామన్నారు. ఇప్పటికే క్రీడాకారులకు దుస్తులు అందించడంతో పాటు రాష్ట్రస్థాయిలో వాళ్లు పాల్గొనే పోటీలకు నగదు ప్రోత్సాహం కూడా అందిస్తూ వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

## ఘనంగా జుత్తు జగన్నాయకులు 66వ జయంతి

(సత్యంన్యూస్, పలాస)

డా.వై.యస్.ఆర్.ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మెంబెర్ బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం మందస మండలం భేతాళపురం గ్రామంలో ఉద్దాన ప్రాంత రాజకీయ చైతన్య రథసారథి,పలాస నియోజకవర్గం ప్రప్రథమ శాసనసభ్యులు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 294 మంది శాసన సభ్యులలో నిరుపేద శాసనసభ్యుడు,రైతు బాంధవుడు,అసెంబ్లీలో కిడ్నీ మహమ్మారిపై తొలిసారి గళం విప్పిన నాయకుడు, అదే కిడ్నీ జబ్బుతో అనారోగ్యానికి గురై మృతి చెందిన అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న అభివృద్ధి ప్రదాత స్వర్గీయ జుత్తు జగన్నాయకులు 66వ జన్మదినం సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి, జగన్నాయకులు విగ్రహాల వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జగన్నాయకులు పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధుల నివారణపై ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. జగన్నాయకులు ఆశీస్సులు మన ఉద్ధానం ప్రాంతంపై ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, గుంటు.లింగరాజు, జె.పాపారావు, కె.మోహన్ రావు, టి.అప్పలస్వామి, రుషేంద్రరావు, జె.నారాయణ, వార్డు మెంబెర్ సంగారు.కృష్ణా రావు,జి.చందయ్య,దున్న సురేష్ పాల్గొన్నారు.





ప్రత్యక్ష దైవం ఆరోగ్య ప్రధాత సూర్యనారాయణ స్వామి వారి అనివెట్టి మండపంలో సోమవారం ఉదయం ఆలయ అర్చకులు, వేదపండితులు శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వ హించారు అనంతరం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఈ కార్యక్రమం నిర్వహించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఐతమ్ అధ్యాపకునికి డాక్టరేట్ పట్టా

(సత్యంన్యూస్, టెక్కలి)



స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్ మెంట్ విభాగంలో గణిత శాస్త్ర బోధకులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వి.వి.వి ఎస్.ఎస్. పి.ఎస్ శ్రీకాంత్‌కు 'గీతం డీమ్డ్ టు' విశ్వ విద్యాలయం నుంచి క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఆల్మాస్టా సెమిహాటింగ్ డిస్టిబ్యూ లాటస్ పరిశోధనలో డాక్టరేట్ డిగ్రీను ప్రధానం చేసిందని , ఆ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారము నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు . ఈ డిగ్రీను ఈ కళాశాల అధ్యాపకులు చెందడంపట్ల డైరెక్టర్ నాగేశ్వరరావు, తో పాటుగా ప్రిన్సిపాల్ ఏ.ఎస్. శ్రీనివాసరావు, ఆర్ అండ్ డి డీన్ శ్రీరాములు, ప్లేస్మెంట్ అధికారి ఎం ఎన్ వి ఎస్ ఎస్ సంతోష్ మరియు తోటి బోధన బోధనేతర సిబ్బంది డాక్టర్ శ్రీకాంత్‌ను అభినందించారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 'ఆఫ్‌షోర్' సమస్యలను పరిష్కరించాలి

## - నిర్వాసితుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఆఫ్‌షోర్ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, నిర్వాసితుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సింహాచలం డిమాండ్ చేశారు. సోమవారం నిర్వాసితులతో కలిసి జిల్లా గ్రీవెన్స్‌సెల్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 18 ఏళ్లు కావస్తున్నా ప్రాజెక్టు పని నత్తనడకగా సాగుతోందని ధ్వజమెత్తారు. నిర్వాసితులు చాలా రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. రిజర్వాయర్ పనులు ప్రారంభించి చాలా ఏళ్లు గడుస్తున్నా, ప్రాజెక్టు అంచనా వ్యయం రూపాయలు 120 కోట్ల నుంచి రూపాయలు 55 కోట్ల వరకు పెంచినప్పటికీ, నిర్వాసితులకు చెల్లించవలసిన పరిహారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. జిల్లా మంత్రులు, పలాస, పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని నిర్వాసితులతో సంయుక్త సమావేశం ఏర్పాటుచేసి సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఎంతటి పోరాటమైన కొనసాగిస్తామని హెచ్చరించారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రీవెన్స్ ముందు ధర్నా చేపడుతున్నవారి వద్దకు డిఆర్‌వో వచ్చి నిర్వాసితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టిలో పెట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శిర్ల ప్రసాద్, చీపురుపల్లి గ్రామ సర్పంచ్ ఈశ్వరరావు పెద్ద ఎత్తున నిర్వాసితులు పాల్గొన్నారు.

# మేం వేసిందే రోడ్డు.. చెప్పొద్దు అడ్డు!

(మొదటిపేజీ తరువాయి)



ఒకవైపు, గొండు శంకర్ మరోవైపు అమరావతికి షటిల్ సర్వీస్ చేసి రూ.15 కోట్లు విడుదలయ్యేటట్లు చేశారు. అయినా రోడ్డు పనులు ముందుకు కదలకపోవడంతో రోడ్డు రోలర్లు, హాట్‌మిక్సర్లు, పొక్లెయిన్లు, జేసీబీలు తిరగడానికి వీలుగా ఎమ్మెల్యే గొండు శంకర్ తన ఖాతాలో డీజిల్ ఇప్పించారు. కూన రవికుమార్ అయితే అప్పు చేసి మరీ రోడ్డు పనులు చేయడానికి కాంట్రాక్టర్‌కు డబ్బు సర్దుబాటు చేశారు. అయినా కూడా పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి.

### నాసిరకంగా నాణ్యత

ఇప్పటి వరకు జరిగిన పనులైనా నాణ్యంగా ఉన్నాయా? అంటే.. అదీ లేదు. పాత రోడ్డుకు ఇరువైపులా 80 అడుగుల మేర వెడల్పు చేస్తున్నప్పుడు పాత రోడ్డుకు ప్యాచ్‌వర్క్, కొత్తరోడ్డుకు బ్లాక్ టాప్ వేయాల్సి ఉంది. ఈ రెండూ కలిసే చోట ఎత్తుపల్లాలు లేకుండా కొత్తగా ఒక లేయర్ వేయాలి. కానీ పాత, కొత్త రోడ్డు కలిసిన చోట ఎగుడుదిగుడులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక ప్రొఫెషనల్ కాంట్రాక్ట్ సంస్థ చేపడుతున్న పనులుగా ఏమాత్రం కనిపించడంలేదు. గత కొన్నాళ్లుగా శ్రీకాకుళం రూరల్ మండలం రాయిపాడు వద్ద కల్వర్టును నిర్మిస్తున్నారు. ఇది ఎప్పుడు పూర్తవుతుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. డబ్బులిచ్చి మరీ ఎమ్మెల్యేలు జనంతో తిట్టించుకుంటున్నారు. ఈ కల్వర్టు పనులు చూస్తుంటే ప్రజాప్రతినిధుల మీద బిల్లుల చెల్లింపునకు ఒత్తిడి తేవడం కోసమే ఆలస్యం చేస్తున్నట్టు కనిపిస్తోంది. బాక్స్ కల్వర్టు పద్ధతిలో నిర్మిస్తున్న దీన్ని త్వరిత గతిన పూర్తిచేయాల్సి ఉన్నా కాంట్రాక్టర్ అటువైపు దృష్టి సారించడంలేదు. బహుశా రాష్ట్రంలో ఎక్కడా ఇటువంటి పనులు జరిగి ఉండవు. సాధారణంగా ఒక రోడ్డు వెడల్పు చేసేటప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న స్ట్రక్చర్లు అంటే.. కల్వర్టులు, ఖానాలు, బ్రిడ్జిల పనులు ముందు పూర్తిచేసి, ఆ తర్వాత రోడ్డు వేస్తారు. కానీ ఇక్కడ మాత్రం రోడ్డు వేసేసిన తర్వాత స్ట్రక్చర్ వర్క్ చేస్తున్నారు. అలా అని ఈ పనులు చేపడుతున్న సంస్థ చిన్నదేమీ కాదు. అనుభవం లేనిది అంతకంటే కాదు. కానీ ఇలా ఎందుకు చేస్తున్నారనే దానిపై అందరికీ సందేహాలున్నాయి. ఇప్పటి వరకు రూ.15 కోట్ల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించినట్టు భోగట్టా. ఇంకో రూ.8 కోట్ల పనులు ఇటీవల జరిగాయి. అయితే మొత్తం పనుల్లో ఎక్కడా నాణ్యత కనిపించడం లేదు. శ్రీకాకుళం డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఆమదాలవలస బ్రిడ్జి వరకు రోడ్డు మొత్తం అందుబాటులోకి వచ్చే సమయానికి ఆమదాలవలస వైపు ఇప్పటికే నిర్మించిన రోడ్డు మెయింటెనెన్స్‌కు వచ్చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గతంలో ఈ పనుల కోసం ఎన్‌ఎన్‌ఆర్, జీఆర్ వంటి సంస్థలు బిడ్డింగ్‌కు వచ్చినా, ఆ తర్వాత వెనక్కు వెళ్లిపోయాయి. ఎవరూ దిక్కు లేకపోతే తాము చేస్తున్నాం కాబట్టి మేం వేసిందే రోడ్డు అన్న చందంగా సంబంధిత కాంట్రాక్టర్ వ్యవహరించడంపై ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు.

## ఔట్‌సోర్సింగ్ జీతాల చెల్లింపులో

# థర్డ్‌పార్టీ విధానం రద్దు చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కాంట్రాక్టర్ విధానం (థర్డ్ పార్టీ) రద్దు చేసి నేరుగా కార్పొరేషన్ ద్వారా కార్మికుడి బ్యాంకుకు జీతాలు చెల్లించేలా చూడాలని ఏపీపీటీడీ ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజెఏసి అనుబంధం) కోరింది. తమ సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీకాకుళం జిల్లాలోని 4 డిపోల్లో పని చేస్తున్న కార్మికులు సంబంధిత డిపోల ఆవరణలో శాంతియుత ఆందోళన నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈమేరకు సోమవారం శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో శాంతియుత నిరసన తెలిపారు. రెండు దశాబ్దాలుగా సంస్థను నమ్ముకొని వివిధ విభాగాల్లో కార్మికులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో జిల్లాలో 220 మంది పని చేస్తున్నారని, వీరికి కాంట్రాక్టర్ వ్యవస్థ వలన ఆర్టీసీ బోర్డు యాజమాన్యం నిర్ణయించిన జీతాలు సర్క్యులర్ ప్రకారం కాంట్రాక్టర్లు చెల్లించడం లేదని, జీతాల్లో రూ.2వేల నుంచి రూ.3వేల వరకు కార్మికుల నుంచి శ్రమదోపిడి చేస్తున్నారని, ఈ సమస్యను ప్రజారవాణా అధికారికి తెలిపినా కాంట్రాక్టర్లు పైఅధికారులు ఆదేశాలను లెక్కచేయకుండా వారికి నచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారని యూనియన్ జిల్లా అధ్యక్షులు దాసరి కిరణ్, ట్రెజరర్ ఆర్.నవీన్ కుమార్ ఆరోపించారు.

## వితంతు పింఛను ఇప్పించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్ని అర్హతలు ఉన్న ఇద్దరు వితంతువులకు పింఛను ఇప్పించాలని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి కుమార్ జిల్లా రెవెన్యూ అధికారిని కోరారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ మండలం కటకమయ్యపేట గ్రామంలో ఇద్దరు వితంతువులకు అన్ని అర్హతలున్నా, రాజకీయ కారణాలతో గత 8 నెలలుగా పింఛన్లు నిలిపివేశారని, వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు.



# ఫేట్ మార్చిన ఫోటో!

(మొదటిపేజీ తరువాయి)

**కార్యక్రమం మన సనాతన విద్య అయిన యోగాను కింది స్థాయి వరకు తీసుకెళ్లడంలో విజయం సాధించిందనడానికి ఈ ఫొటోయే నిదర్శనమని చంద్రబాబు వ్యాఖ్యానించారు.**

ఇంత సంచలనం సృష్టించిన సదరు ఫొటో తీసిన వ్యక్తి.. అందులో ఉన్న మహిళ.. ఎవరన్న ఆసక్తి ఇప్పుడు పెరిగింది. సృజనాత్మకత ఉట్టిపడుతున్న ఈ ఫొటోను తీసిన వ్యక్తి కాకలుతీరిన ఫొటోగ్రాఫరూ కాదు.. జర్నలిస్టిక్ వ్యూ కలిగిన కెమెరా జర్నలిస్టూ కాదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఆయన పోలీస్ శాఖలో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్. పేరు దివిలి హేమచంద్ర. స్వగ్రామం గార మండలం శ్రీకూర్మం. ఉద్యోగరీత్యా ప్రస్తుతం శ్రీకాకుళంలో ఉంటున్నారు. ఆ ఫొటోకు ప్రేరణగా నిలిచిన మహిళ ఒక ఉపాధి హామీ పథకం కూలీ. పేరు కలగ దానమ్మ. గార మండలం సెగిడిపేట వాస్తవ్యురాలు. యోగాంధ్ర కార్యక్రమానికి సన్నాహకంగా ఈ నెల 16న శ్రీకూర్మంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న దానమ్మ యోగాభ్యాసం చేస్తున్న దృశ్యాన్ని ఆ సమయంలో అక్కడే ఉన్న కానిస్టేబుల్ హేమచంద్ర తన మొబైల్ ఫోనులో బంధించారు. దాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా అది కాస్త వైరల్ అయ్యి.. ప్రశంసలు కురిపిస్తోంది.

### పోలీసు కుటుంబం

ఒక్క ఫొటో కారణంగా రాత్రికి రాత్రే వార్తల్లో వ్యక్తిగా మారిన హేమచంద్రది పోలీసు కుటుంబం. ఆయన తండ్రి దివిలి అప్పారావు ప్రముఖ శిల్పకారుడు. రిటైర్డ్ డైట్ లెక్చరర్ అయిన ఆయన 2018లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డు పొందిన ప్రతిభావంతుడు. 2011లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి నుంచి ఉగాది పురస్కారం. 2009లో మద్రాస్ తెలుగు అకాడమీ పురస్కారం కూడా అందుకున్న ప్రతిభాశాలి. ఆయనకు ముగ్గురు కుమారులు ఉండగా అందరూ పోలీసు శాఖలోనే పని చేస్తుండటం విశేషం. పెద్ద కుమారుడు ప్రస్తుతం సీఐడీ విభాగంలో సీఐగా, రెండో కుమారుడు విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తుండగా చిన్న పుత్రుడు హేమచంద్ర శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ విభాగంలో కానిస్టేబల్‌గా పని చేస్తున్నారు. 2004లో ఉద్యోగంలో చేరిన హేమచంద్ర ఫొటోగ్రఫీని హాబీగా చేసుకున్నారు. ఈ రంగంలో ఎటువంటి సాంకేతిక కోర్సులు చేయకుండా కేవలం ఉత్సాహంతో గతంలో తన వద్ద ఉన్న కెమెరాతో ఫొటోలు తీయడం ప్రారంభించి.. ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోనుతోనే అద్భుతమైన ఫొటోలు తీస్తున్నారు.

### బహుళ రంగాల్లో ప్రతిభ

హేమచంద్ర చేసేది పోలీసు ఉద్యోగమే అయినా కళల పట్ల అమితమైన అభిరుచి, ఇష్టం ఉన్న వ్యక్తి. తండ్రి నుంచి వారసత్వంగా శిల్పకళను కూడా పుణికిపుచ్చుకున్నారు. ఖాళీ సమయాల్లో శిల్పాలు తయారు చేస్తుంటారు. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ శ్రీకేష్ లాట్‌కర్ సూచన మేరకు ఒకటిన్నర అడుగుల అరసవల్లి సూర్యనారాయణస్వామి మినియేచర్ విగ్రహాన్ని తయారు చేశారు. దాన్ని 2023లో ఉగాది రోజు ఆవిష్కరించారు. అలాగే ఇటీవల బాపూజీ కళామందిర్‌లో ఆవిష్కరించిన ప్రముఖ గాయకుడు జి.ఆనంద్ విగ్రహాన్ని కూడా ఈయనే తయారుచేశారు. ఆర్డర్లపై కూడా విగ్రహాలు చేస్తుంటానని హేమచంద్ర చెప్పారు. దీంతోపాటు ఫొటోగ్రఫీపై కూడా చిన్నతనం నుంచీ అభిలాష పెరిగిందన్నారు. ఆ ఆసక్తితోనే ఎక్కడికి వెళ్లిన ఫొటోలు తీయడం అలవాటుగా మారింది. గతంలో తన వద్ద ఉన్న కెమెరాతో ఇప్పుడు ఆండ్రాయిడ్ ఫోన్‌తోనే సృజనాత్మకత ఉట్టిపడే ఫొటోలు తీస్తున్నారు. ఎక్కువగా ప్రకృతి అందాలను, చారిత్రక ప్రాంతాలను తన ఫొటోల్లో బంధిస్తుంటారు. ఈ జిజ్ఞాసే ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో అతనికి గుర్తింపు తెచ్చిపెట్టింది. అంతేకాకుండా హేమచంద్ర కవితలు రాస్తుంటారు. గొంతు సవరించుకుని గాయకుడిగా కూడా రాణిస్తున్నారు. స్థానికంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాల్లో పాటలు పాడి ఆహూతులను రంజింపజేస్తుంటారు.

# హోరెత్తించిన 'యువత పోరు'

- ✶ నగరంలో నిరసన ర్యాలీ
- ✶ వైకాపా ముఖ్య నేతలంతా హాజరు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




యువత పోరు పేరుతో వైకాపా యువజన విభాగం నిర్వహించిన నిరసన కార్యక్రమం నగరంలో హోరెత్తించింది. వైకాపా అధిష్టానం ఇచ్చిన పిలుపుతో పార్టీ ముఖ్య నాయకులంతా కార్యకర్తలతో కలిసి యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ రోడ్డులో ఉన్న జ్యోతీరావుపూలే విగ్రహం నుంచి జెడ్పీ సమావేశ మందిరం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి గ్రీవెన్స్‌లో డీఆర్‌వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభ హరిబాబు, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పెర్సన్ పిరియ విజయ సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ ఇన్‌చార్జీలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైకాపా నాయకులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేయడంలో కూటమి పెద్దలు నిమగ్నమయ్యారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు ఇవ్వక, ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వక మోసం చేస్తూ.. ఉన్న ఉద్యోగాలు తీసేస్తూ లక్షలమంది పొట్ట కొడుతుందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల తొలగింపు ఆందోళన కలిగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం తీరు వల్ల 2.60 లక్షల వాలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. వాలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించారని దుయ్యబట్టారు. కూటమి చర్యల వల్ల ఏపి బేవరేజెస్ కార్పొరేషన్లో పని చేసిన 18వేల మంది, ఏపీ ఫైబర్ నెట్లో 2వేల మందిని తొలగించారని విమర్శించారు. వైద్యఆరోగ్యశాఖలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకం నిలిపేశారని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ కక్షలతో తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎండీయూ వాహనాల తొలగింపు వల్ల 20వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. ఆప్కాస్ రద్దు చేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. తొలగించిన వారందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ తక్షణమే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంతకు ముందు అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు నగరానికి చేరుకున్నారు. నరసన్నపేట నుంచి యువజన నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, శ్రీకాకుళం నుంచి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవీ స్వరూప్, జిల్లా అధ్యక్షులు మార్పు పృధ్వీ, ఆమదాలవలస నుంచి యువజన నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ అధ్వర్యంలో ర్యాలీతో నగరానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పిన్నింటి సాయి, కోట గోవిందరావు బ్రదర్స్, గేదెల పురుషోత్తం, దుంపల లక్ష్మణరావు మాస్టారు, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఉలాల భారతి, కేవీవీ సత్యనారాయణ, బి.పద్మజ, టి.కామేశ్వరి, ఎన్ని ధనుంజయ, చిన్న జోగారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.